సాక్షి సంగారెడ్డి
శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



నైపుణ్యమే లక్ష్యం.. ఉపాధి మార్గం

ఖేడ్ నియోజకవర్గానికి మంచిరోజులు రాబోతున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు, కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు ఊపందుకున్నాయి. వివరాలు 8లో ▸



రాజీయే రాజమార్గం

'రాజీయే రాజమార్గం' అనే నినాదంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులు పరిష్కరిస్తున్నాయి. వివరాలు 8లో ▸

నేడు జాబ్ మేళా

మెదక్‌కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెమిస్ట్రీ లేదా మైక్రోబయాలజీ సబ్జెక్టులతో పీజీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థుల కోసం జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 7382 929698 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: అభివృద్ధి పనులకు అవసరమయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని జహీరాబాద్, ఖేడ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న డబుల్ బెడ్రూం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. పూర్తి చేసేందుకు అవసరమయ్యే బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అలసత్వం వద్దు



బాధితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీరామ్

కొల్చారం(నర్సాపూర్): ప్రజారోగ్యంపై ఏ మాత్రం అలసత్వం వహించిన కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ శ్రీరామ్ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. ఓపీ రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. అవసరం మేరకు రోగులకు మందులు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారి నవీన్ కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు సకల వసతులతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పాఠశాల సముదాయ సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. బోధనలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ వినియోగించాలని సూచించారు. పాఠశాలల పనితీరు మెరుగుపడడానికి ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకులకు ఇంటర్వ్యూలు

మెదక్‌జోన్: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రుల పరిధిలో గల యోగా సెంటర్లకు ప్రభుత్వం శిక్షకులను నియమించనుంది. ఇందుకోసం మెదక్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా సెంటర్లకు సంబంధించి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించింది. సంగారెడ్డి 15, మెదక్ 14, సిద్దిపేట 16 చొప్పున మొత్తం 45 యోగా సెంటర్లు ఉన్నాయి. ఇందులో ఒక్కో సెంటర్‌కు ఒక మహిళ, ఒక పురుషుడు చొప్పున మొత్తం 90 మంది యోగా శిక్షకులు అవసరం. కాగా గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 91 మంది అభ్యర్థులు హాజరు కాగా వారికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం కొండాపూర్ మండలంలోని కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డగోలు అనుమతులు

చెరువు భూమిని నాలా కన్వర్షన్ చేసిన అధికారులు

- యథేచ్ఛగా ఎన్‌ఓసీలు సైతం జారీ..
- పెద్ద చెరువు అక్రమ నిర్మాణాల వెనుక అవినీతి బాగోతం
- నీటిలో తేలియాడే నాలుగంతస్తుల భవన నిర్మాణం



మల్కాపూర్ పెద్ద చెరువులో జిల్లా అధికారులు కూల్చివేసిన అక్రమ నిర్మాణం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కొండాపూర్ మండలం మల్కాపూర్ (కుతుబ్‌షాయిపేట) పెద్ద చెరువులో రిక్రియేషన్ క్లబ్ తరహాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణానికి అధికారులు అడ్డగోలుగా అనుమతులు కట్టబెట్టారు. ఓ రెవెన్యూ అధికారి ఏకంగా ఈ చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లేవల్) భూమిని నిబంధనలకు విరుద్ధంగా నాలా (నాన్ అగ్రికల్చర్ అసిస్‌మెంట్) కన్వర్షన్ చేశారు. మరో అధికారి ఇందుకు ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) ఇచ్చారు. ఈ వ్యవహారంలో అప్పటి అధికారులు రూ. లక్షల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇంటి నిర్మాణం పేరుతో అనుమతి తీసుకుని చెరువు మధ్యలో నీటిలో తేలియాడుతున్నట్లుగా నాలుగు అంతస్తుల భవనం నిర్మించారు. అందులోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా బ్రిడ్జిలు కట్టారు. రెండు మూడు కాటేజీలు, స్విమ్మింగ్‌పూల్ నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాన్ని గురువారం జిల్లా ఉన్నతాధికారులు కూల్చి వేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రొక్లెయినర్లు, జేసీబీలతో కూల్చివేతకు సాధ్యం కాకపోవడంతో డిటోనేటర్లు పెట్టి పేల్చివేయడం కలకలం సృష్టించింది.

కాసులు దండుకున్న అధికారులు

ఇక్కడ 333 గజాల విస్తీర్ణంలో ఆర్‌సీసీ భవనాన్ని నిర్మించుకునేందుకు మల్కాపూర్ పంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నారు. కానీ నిర్మాణం మాత్రం నీటిలో తేలియాడే మాదిరిగా నాలుగంతస్తుల భవనం, స్విమ్మింగ్ పూల్, కాటేజీ లాంటి గదులు నిర్మించారు. విందులు, విలాసాలు చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఈ భవన నిర్మాణానికి అనుమతుల మంజూరులో కూడా అప్పటి పంచాయతీ అధికారులు పెద్ద మొత్తంలో కాసులు దండుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 333 గజాల స్థలంలో ఇంటికి అనుమతించి, నాలుగంతస్తులు కట్టుకున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.

ఫిర్యాదు చేసినా కన్నెత్తి చూడలే..

2012లో అనుమతులు తీసుకొని చేపట్టిన అక్రమ నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. పలువురు గ్రామస్తులు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ కాసులు దండుకున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. తాజాగా ప్రభుత్వం చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ భూముల కబ్జాలపై ఉక్కుపాదం మోపుతోంది. అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తోంది. ఈనేపథ్యంలో మల్కాపూర్ పెద్ద చెరువులో నిర్మించిన ఈ అక్రమ నిర్మాణానికి వారం క్రితం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి గురువారం ఉదయం కూల్చివేశారు.

తొలిసారిగా హెచ్ఎండీఏ యేతర మండలాల్లో..

ఇప్పటివరకు ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల ఉన్న అక్రమ కట్టడాలనే హైడ్రా గత కొన్ని రోజులుగా కూల్చివేస్తున్న విషయం విదితమే. హెచ్ఎండీఏ పరిధిలోని అమీన్‌పూర్, పటాన్‌చెరులో హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ప్రస్తుతం హెచ్ఎండీఏ యేతర మండలాల్లోనూ కూల్చివేతలు చేపట్టడం జిల్లాలో సంచలనంగా మారింది.

బాధ్యులపై చర్యలు: కలెక్టర్

'చెరువులో ఎఫ్‌టీఎల్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలకు ఎన్‌ఓసీలు, నాలా కన్వర్షన్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఈ నిర్మాణానికి 12 ఏళ్ల క్రితం అనుమతులు ఇచ్చారు. అప్పుడు ఎవరు పనిచేశారు. అనే దానిపై నివేదికలు తెప్పించుకుంటాం. అక్రమ అనుమతులు మంజూరుకు బాధ్యులైన వారిపై తప్పకుండా చర్యలుంటాయి.' అని కలెక్టర్ వల్లూరు క్రాంతి 'సాక్షి' ప్రతినిధితో పేర్కొన్నారు.

ఎంపీఓ, కార్యదర్శి సస్పెన్షన్

సంగారెడ్డి జోన్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరి క్రాంతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్ మహిపాల్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఝరాసంగం మండల పరిధిలోని మాచ్నూర్ పంచాయతీ ప్రత్యేక అధికారి ఉన్న ఎంపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్ గ్రామంలోని పలువురు ఇళ్లను ఆ ఇంటి యజమానులకు తెలియకుండా, ఎలాంటి పత్రాలు లేకుండా ఇతరుల పేరుపై మార్పిడి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో అసిస్‌మెంట్లు జారీ చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు జూలైలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

పటాన్‌చెరు టౌన్: అనుమతి మేరకే నిర్మాణాలు చేపట్టాలని, అలా కాకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని ఇస్నాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఇస్నాపూర్ నుంచి పాశమైలారం రహదారికి ఆనుకొని నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపడుతుండడంతో గురువారం సిబ్బందితో కలిసి పనులను నిలిపివేయించారు. అక్కడ కొంతమంది దురుసుగా వ్యవహరించడంతో ఆగ్రహం చెందిన కార్యదర్శి పనిముట్లను పంచాయతీకి తరలించారు.

సింగూరుకు ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పెరుగుతుండడంతో రెండు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. నాలుగు రోజులుగా ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డ్యాంలోకి 14,563 క్యూసెక్కుల ఇన్ ఫ్లో చేరుతుండడంతో 6, 11 నంబర్ గేట్లను మీటరున్నర పైకి ఎత్తి దిగువకు 16,284 క్యూసెక్కుల నీటిని వదుతున్నారు. జలవిద్యుత్ కేంద్రంలో 2,823 క్యూసెక్కుల నీటితో రెండు టర్బయిన్లను రన్ చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. పర్యాటకులు ప్రాజెక్టు వద్ద సందడి చేస్తున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లి, ఖాజీపేట జెడ్పీహెచ్ఎస్‌తో పాటు మంతూర్ యూపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు మాత్రమే చదువుకుంటారని, వారిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ కమిటీల ప్రగతిపై ఆరా తీశారు. పాఠశాలల నిర్వహణతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కమిటీలు పనిచేయాలని సూచించారు. అసంపూర్తి పనులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాగు నీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ సక్రమంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గౌరీశంకర్, సీసీ ప్రవీణ్, సీఏలు మంగేశ్వరి, జ్యోతి, స్వప్న, ఆదర్శ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

బాలుడిని చూసి.. కాన్వాయ్ ఆపి




బాలుడికి వాటర్ బాటిల్ అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ

మెదక్ కలెక్టరేట్: మంత్రి కొండా సురేఖ చిన్నారులపై తనుకున్న మమకారాన్ని చాటుకున్నారు. గురువారం జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఈసందర్భంగా అక్కడ ఓ మహిళా కానిస్టేబుల్ చేతిలో పసిబిడ్డను చూసి కాన్వాయ్ ఆపి ఆమె వద్దకు వెళ్లారు. కానిస్టేబుల్ చేతిలో ఉన్న బాలుడిని ఎత్తుకొని తాగునీరు తాగించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారి తల్లి కానిస్టేబుల్ శ్రీలతను పిలిచి మాట్లాడారు. వారిని తనతో కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లారు. పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ మహిళా కానిస్టేబుల్ పరిస్థితిని వివరించి మరోచోట డ్యూటీ వేయాలని ఆదేశించారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

మెదక్ కలెక్టరేట్: డీఎస్సీ– 2008 పరీక్ష రాసిన బీఈడీ అభ్యర్థులకు ఈనెల 27, 28 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు డీఈఓ రాధాకిషన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి డీఈఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. అభ్యర్థుల జాబితా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. వెబ్‌సైట్ నుంచి ధృవీకరణ ఫారంను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను పూర్తిచేయాలని తెలిపారు. 1 నుంచి 7వ తరగతి వరకు సర్టిఫికెట్లు, టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీఎడ్, కుల ధృవీకరణ, బీఎడ్ హాల్‌టికెట్, ర్యాంక్‌కార్డుల జిరాక్స్ సర్టిఫికెట్లపై గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టెడ్ చేయించి 2 పాస్ ఫొటోలను ధృవీకరణ పత్రానికి జతచేసి తీసుకురావాలని సూచించారు. 28వ తేదీ తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు.

జల దిగ్బంధంలోనే దుర్గమ్మ



ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న అర్చకుడు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం మూడు రోజులుగా జల దిగ్బంధంలోనే కొనసాగుతోంది. సింగూరు నుంచి విడుదల చేసిన 11,446 క్యూసెక్కుల ప్రవాహం ఘణపురం ఆనకట్టపై నుంచి పొంగిపొర్లుతుంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి భక్తులు పూజలు చేస్తున్నారు. మంజీరా నది వైపు భక్తులు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఐలమ్మ జయంతి వేడుకల్లో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి తదితరులు



మెదక్: ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వీర వనిత చాకలి ఐలమ్మ

సంగారెడ్డి జోన్/మెదక్ కలెక్టరేట్: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌తో పాటు పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధన, అనంతర ప్రగతి ప్రస్థానంలో ఐలమ్మ స్ఫూర్తి ఇమిడి ఉందని కొనియాడారు. సంగారెడ్డి పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్ క్రాంతి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆందోళన వద్దు.. మేమున్నాం

పర్యావరణ వేత్తలు పురుషోత్తంరెడ్డి, నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఫార్మాసిటీ ఏర్పాటుకు సంబంధించి రైతులు ఆందోళన చెందొద్దని, కలిసికట్టుగా పోరాటం చేయాలని పర్యావరణ వేత్తలు ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని డప్పూర్‌లో ఫార్మాసిటీ భూబాధితులు, రైతులు ఏర్పాటుచేసిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. 2013లో భూసేకరణ చట్టానికి సవరణలు జరిగాయని, దాని ప్రకారం ఫ్యాక్టరీలు ఇతర వాటి కోసం భూములు తీసుకోవాలంటే రైతుల అనుమతి తప్పనిసరన్నారు. 60 శాతం మంది ఒప్పుకుంటేనే ప్రభుత్వం భూములు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. మూడు పంటలు పండే భూములు, అనుమతి లేకుండా తీసుకోవడానికి వీల్లేద్దన్నారు. పచ్చని పల్లెల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడం వల్ల వాయు కాలుష్యంతో పాటు జల కాలుష్యమై ప్రకృతి విధ్వంసం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమీపంలో మంజీరా నది నుంచి జంట నగరాలకు తాగునీటి సరఫరా అవుతున్నందున, కాలుష్యమైన నీరు తాగే హైదరాబాద్ వాసులు కూడా రోగాల బారిన పడాల్సి వస్తుందన్నారు. మాకు ఇప్పటివరకు ఓటమి ఎదురు కాలేదని.. మీ పోరాటాల వెనుక మేముంటామని రైతులకు భరోసా ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఫార్మాసిటీకి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని భూ నిర్వాసితులు, రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల పెద్దలు, భూ నిర్వాసితులు, రైతులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



పదోన్నతి పొందిన సిబ్బందితో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లాలో ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న వెంకటరాములు, లక్ష్మీనారాయణ ఏఆర్ ఎస్ఐలుగా పదోన్నతి పొందారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ వారిని అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇదేవిధంగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సర్వీస్‌లో మరిన్ని పదోన్నతులు పొంది పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే ఈనెల 28న జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రంగనాయక్, ఆర్ఐ శైలేందర్, ఏఆర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్హులకు పోడు పట్టాలిస్తాం

- మంత్రి కొండా సురేఖ
- మెదక్ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మెదక్‌జోన్: పోడు భూములు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న అర్హులైన నిరుపేదలకు పట్టాలిద్దామని, అడవిలో సాగు చేసిన పంటలు ధ్వంసం చేయొద్దని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో అడవుల పరిస్థితితో పాటు వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల గురించి ఆరా తీశారు. జిల్లావ్యాప్తంగా 6,865 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైందని, కోర్టులో కేసు వేశామని డీఎఫ్‌ఓ జోషి తెలిపారు. ప్రభుత్వం తరపున వాదించే పీపీ ఎవరని మంత్రి ప్రశ్నించగా ఆయన తెలియదని చెప్పడంతో, పూర్తి సమాచారంతో రావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. 2018లో కొంతమందికి పోడు పట్టాలు ఇచ్చారని, వారు పంట సాగు చేసుకుంటే ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారని తెలిపారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో చాలా కాలంగా పేదలు పోడు భూముల్లో పంటలు పండించుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పర్యాటక అభివృద్ధి కోసం జిల్లాలో అనువైన ప్రాంతాలు ఏవని మంత్రి డీఎఫ్‌ఓను ప్రశ్నించగా.. ఏడుపాయల దేవస్థానం, మెదక్ ఖిల్లా, చర్చి, పోచారం అభయారణ్యం హబ్‌గా ఏర్పాటు చేయవచ్చని, ఇప్పటికే నర్సాపూర్ అటవీలో పర్యాటకుల కోసం 15 కాటేజీలు నిర్మించామని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 49 శాతం, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 83 శాతం ఆపరేషన్లు జరుగుతున్నాయని డీఎంహెచ్ఓ శ్రీరాం చెప్పగా.. మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రులపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఊరు– మన బడి పథకం కింద మరమ్మతులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ. 11.16 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వారు అర్ధాంతరంగా పనులు ఆపారని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. ఈ విషయంపై మంత్రి మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు పంపాలని, సీఎంతో చర్చించి పెండింగ్ బిల్లులు విడుదల చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో అనేక అవకతవకలు జరిగాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయమై ముందస్తు చర్యలు తీసుకొని రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కోనాపూర్, చేగుంట, రుక్మాపూర్, ఇబ్రహీంపూర్, రెడ్డిపల్లి సొసైటీల్లో జరిగిన కుంభకోణం ఏమైందని ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు.

అర్హులకు రుణమాఫీ కాలేదు

జిల్లాలో చాలా మంది అర్హులకు రుణమాఫీ కాలేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. రుణమాఫీ కాని వారి సర్వే జరుగుతుందని, రేషన్‌కార్డు లేని వారిని వ్యవసాయ అధికారులు గుర్తిస్తున్నారని మంత్రి తెలిపారు. రూ. 2 లక్షలు పైబడిన వారికి సైతం త్వరలోనే అవుతుందని, రుణమాఫీకి సంబంధించి ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 29న అండర్ 19 జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తామని అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, ప్రధాన కార్యదర్శి పీవీ రమణ తెలిపారు. గురువారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ... 2005 జనవరి ఒకటి తర్వాత జన్మించిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులన్నారు. బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీలో ఎంపికలను నిర్వహిస్తామన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 4 నుంచి 6 వరకు కామారెడ్డి జిల్లాలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 3 పాస్ ఫొటోలతోపాటు, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను వెంట తీసుకొని ప్రారంభ రోజు మధ్యాహ్నం 3 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9704746511, 9440703038 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలో నర్సాపూర్ డిగ్రీ విద్యార్థులు



ప్రయోగశాలలో విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పెద్ద చింతకుంట) ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనకు తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐ క్యాంపస్‌లను సందర్శించారు. భూమిలో ఏర్పడే శిలలలో ఉన్న ఖనిజ లవణాలను గుర్తించే విధానాన్ని అక్కడి శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. ప్రయోగశాలలు, జంతువులపై జరుగుతున్న జన్యు పరిశోధనలు, వ్యాక్సిన్‌ల తయారీ, జీవ శాస్త్ర పరిశోధనలపై అవగాహన పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సురేశ్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సౌజన్య, వృక్షశాస్త్ర అధ్యాపకురాలు రుక్మిణి, రసాయన శాస్త్ర అధ్యాపకులు ఆరీఫ్, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ బీరు కలకలం

సీసాలో పేరుకుపోయిన నాచు



బీరులో నాచు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో కల్తీ బీరు కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు గంగాధరి శ్రీనివాస్, సరదాగా స్నేహితులు వస్తే గ్రామంలోని ఓ బెల్ట్ షాప్‌లో బీర్లు తీసుకున్నారు. తాగేందుకు బీరును ఓపెన్ చేయగా లోపలంతా నాచు పేరుకుపోయి కనిపించింది. దీంతో ఒక్కసారిగా అవ్వాక్కయ్యారు. బీర్లు కొనుగోలు చేసిన బెల్ట్ షాపు నిర్వాహకుడిని ప్రశ్నించగా తాను అక్కన్నపేటలోని వైన్స్ షాపులో తీసుకొచ్చానని తెలిపాడు. వైన్స్ షాపు నిర్వాహకుడిని సంప్రదించగా మరొక బీరు ఇస్తామని, సరఫరానే అలా వస్తుందని బదులిచ్చాడు. ఏ మాత్రం నాణ్యత లేని నాసిరకం బీర్లు అమ్ముతున్నారని, ఎక్సైజ్ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బైండోవర్ ఉల్లంఘన

వ్యక్తికి రూ.లక్ష జరిమాన

పుల్‌కల్(అందోల్) : బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ఇసోజీపేటకు చెందిన చంద్రారెడ్డికి కుమారులు నర్సింహారెడ్డి, భాస్కర్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి ఉన్నారు. భూమి విషయంలో జరిగిన గొడవల్లో ముగ్గురిపై ఆరు కేసులు నమోదు కాగా, అన్నాదమ్ముళ్లందరినీ తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. ఇందులో సుఖేందర్ రెడ్డి బైండోవర్‌ను ఉల్లంఘించడంతో గురువారం పోలీసులు తహసీల్దార్ ఎదుట మళ్లీ బైండోవర్ చేశారు. తహసీల్దార్ విచారణ చేసి రూ.లక్ష పూచి కత్తు కట్టాలని, లేదా ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తెలిపారు. సుఖేందర్ రెడ్డి రూ.లక్ష చెల్లించాడు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

నైపుణ్యమే లక్ష్యం.. ఉపాధి మార్గం

ఖేడ్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, కర్మాగారాలు

జిల్లాలోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో అట్టడుగున ఉన్న నారాయణఖేడ్ నియోజకవర్గానికి మంచిరోజులు రాబోతున్నాయి. ఇటీవలె ప్రభుత్వం నియోజకవర్గానికి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌తోపాటు, కర్మాగారాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇవి పూర్తయితే ఇక్కడి స్థానికులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



- జుక్కల్ సరిహద్దుల్లో స్థలాలు పరిశీలన
- ప్రభుత్వం సైతం సానుకూలత
- ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే
- యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు

నారాయణఖేడ్: జిల్లాలోనే ఉపాధి పరంగా అవకాశాలు లేక స్థానిక యువత నిరుద్యోగంతో ఇబ్బందులు పడడం, వలస జీవనం సాగించడం, యువశక్తి వృథా అవుతూ ఆర్థికంగా చితికిపోతున్న విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్‌లు సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన సీఎం స్థానికంగా అవసరమగు భూమిని ఎంపిక చేస్తే ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఇదే విషయాన్నే స్పష్టం చేశారు.

ప్రాథమికంగా స్థలాలు పరిశీలన

కర్మాగారాల ఏర్పాటు కోసం ఖేడ్- జుక్కల్ నియోజకవర్గాల సరిహద్దుల్లో అవసరమగు స్థలాలను ప్రాథమికంగా పరిశీలన చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పలు పర్యాయాలు అధికారులతో స్థలాల ఎంపిక విషయంపై చర్చించారు. దాదాపు 200 నుంచి 400 లోపు ఎకరాల స్థలాలు లభించేలా అధికారులు, నాయకులు చర్యలు చేపట్టారు. స్థలాల ఎంపిక పూర్తయితే కర్మాగారాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి చర్యలు వేగవంతం కానున్నాయి. రవాణా పరంగా అకోలా- నాందేడ్ 161 జాతీయ రహదారి, ఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారులు ఉండడం, మంజీరా నది నీటి సదుపాయం, కర్మాగారాల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉన్న విషయాలను ఇటీవల ఎమ్మెల్యే సంజీవరెడ్డి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డిల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ప్రాథమికంగా స్థలాల పరిశీలనకు ఎంపిక చేసిన పరిశ్రమల యాజమాన్యాలు స్థల పరిశీలనకు చర్యలు చేపట్టారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్..

యువత, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు చేసింది. ఖేడ్ పట్టణంలో ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాల్సి ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు, ఇతరులకు వివిధ రకాల విభాగాలు, వారి వ్యక్తిగత నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుంది. వివిధ రంగాల్లో పూర్తి స్థాయిలో శిక్షణను అందించి యువతను ఉద్యోగాలకు సిద్ధం చేయనున్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుతోపాటు కర్మాగారాలు ఏర్పాటు జరిగిన పక్షంలో ప్రాంతంలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించడం, ఆర్థికంగా కుటుంబాలు ఎదిగేందుకు ఆస్కారం ఏర్పడనుంది. ఏళ్లుగా ప్రాంత వాసులు ఎదురుచూస్తున్న కలలు సాకారం కానున్నాయి.



ఖేడ్‌లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగ యువత (ఫైల్)

యువత కల నెరవేరనుంది



ఐటీఐ, డిగ్రీ విద్యార్హత పూర్తి చేసి నిరుద్యోగిగా ఉన్నాను. ఈ ప్రాంతంలో చేసుకునేందుకు ఎలాంటి పనులు దొరకడం లేదు. కర్మాగారాలు ఏర్పాటు చేస్తే ఎందరో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నా లాంటి చాలా మంది నిరుద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి.

– లోకేష్, నిరుద్యోగి, మావినెల్లి

ఆర్థికాభివృద్ధికి మార్గం



వెనుకబడ్డ నారాయణఖేడ్ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు వల్ల యువత, నిరుద్యోగులు ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల పైనే ఆధారపడకుండా స్వయం ఉపాధిని, పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సేవలు ఉపయోగపడతాయి.

– సీ.నర్సింహారెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు

కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు



ఖేడ్‌లో కర్మాగారాల ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నా. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డి పరిశ్రమల ఏర్పాటు విషయంలో సానుకూలత వ్యక్తం చేశారు. స్థలాల ఎంపికను చేపడుతున్నాం. ఖేడ్‌కు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరైంది. దీంతో యువతకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

– డాక్టర్ పీ.సంజీవరెడ్డి, ఎమ్మెల్యే, నారాయణఖేడ్

విద్యార్థులకు ఆరోగ్య 'ప్రశస్త్'



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సెక్టోరియల్ అధికారి రంగనాథ్

- పిల్లల్లో మానసిక, శారీరక సమస్యల గుర్తింపునకు ప్రత్యేక యాప్
- వివరాలు పొందుపర్చి తగిన చికిత్స
- 63 ప్రశ్నలతో రెండు విడతల్లో పరీక్ష
- పాఠశాలల్లోని సిబ్బందికి అవగాహన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక వైకల్యం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారి వివరాలను ప్రభుత్వం సేకరిస్తుంది. ఇందులో భాగంగానే విద్యాశాఖ ప్రశస్త్ అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా గుర్తించిన వైకల్యాలను నేరుగా విద్యార్థులకు కాకుండా, విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే తెలియజేయనున్నారు.

రెండు విడతలుగా పరీక్షలు



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,010, ప్రైవేట్ పాఠశాలలు 250 ఉన్నాయి. మొత్తంగా సుమారు 1,50,00 మంది విద్యార్థులు ఉంటారు.వీరందరి వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ యాప్ ద్వారా విద్యార్థులకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించి గుర్తించనున్నారు. మొదటి విభాగంలో 63 ప్రశ్నలను పొందుపర్చి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రశ్నించి, సమాధానాలను ప్రత్యేక ప్రశస్త్ యాప్‌లో పొందుపరుస్తారు. రెండో విభాగంలో యాప్‌లో సర్వేను స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పూర్తి చేస్తారు. విద్యార్థుల్లో ఉన్న అన్ని రకాల శారీరక, మానసిక, సామాజిక, విద్యా సామర్థ్యాలకు, చలనాలకు సంబంధించి వైకల్యా లను పరిశీలించి యాప్‌లో సర్వే ఫారం ద్వారా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సమాధానాల ఆధారంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వైకల్యాలను వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారు.

అవగాహన కార్యక్రమాలు

ఇప్పటికే జిల్లా స్థాయిలో ప్రశస్త్ యాప్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్‌లు అవగాహన కల్పిస్తున్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 28, 30 తేదీల్లో మండల స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కూడా ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పించనున్నారు. దీంతో విద్యార్థుల వైకల్యాలను గుర్తించి, వారికి తగిన చికిత్స అందించనున్నారు.

63 ప్రశ్నల ద్వారా పరిశీలన



విద్యాశాఖ ఆధ్వర్యంలోని ప్రశస్త్ యాప్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను గుర్తించనున్నాం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులందరినీ 63 ప్రశ్నల ద్వారా పరిశీలించనున్నాం. యాప్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను గుర్తించి, చికిత్స అందించి, విద్యలో రాణించే విధంగా కృషి చేసేందుకు ఈ ప్రశస్త్ యాప్ ఉపయోగపడుతుంది.

–ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

భవిష్యత్ తెలంగాణ కోసం పనిచేద్దాం

- వేదికలు వేరైనా లక్ష్యం ఒక్కటే ఉండాలి
- ఎమ్మెల్సీ పదవి బాధ్యత పెంచింది
- ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

సిద్దిపేటజోన్: ప్రస్తుతం తెలంగాణ కొత్త తోవ వెతుక్కుంటుందని, భవిష్యత్ తెలంగాణ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పని చేద్దామని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. గురువారం రాత్రి స్థానిక ఎన్జీవో భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మనకు ఎవ్వరి మీద కోపం లేదని, తెలంగాణ ప్రగతి కోసం చిత్తశుద్ధితో కలిసి పనిచేద్దామని సూచించారు. ఎవ్వరి వేదికలు వారికి ఉంటాయని, వేదికలు, వ్యక్తులు వేరైనా లక్ష్యం ఒక్కటేనని, భావి భారత తెలంగాణ అభివృద్ధి ముఖ్యమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ జేఏసీ తరహాలో తెలంగాణ కోసం మళ్లీ ఒకసారి పనిచేయాలని సూచించారు. తెలంగాణ త్యాగ నీరతితో నిస్వార్థంగా ఉద్యమంలో అందరూ పనిచేశారని, సిద్దిపేటలో 1500 రోజుల పాటు దీక్షలు జరగడం మామూలు విషయం కాదన్నారు. ఉద్యమకారుల సమస్యలు చర్చించేందుకు ఒక వేదిక అవసరమన్నారు. ఎమ్మెల్సీగా ఉద్యమకారుల పక్షాన పనిచేయాలని, ప్రభుత్వంతో మాట్లాడి అన్ని వర్గాలకు చెందిన సమస్యలు పరిష్కరించాలనే ఆశతో ఆత్మీయ సమ్మేళనం పేరిట సన్మా నం చేస్తున్నట్టుగా ఉందని, సన్మానం తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్, పబ్లిక్ సర్వెంట్స్ హోం అధ్యక్షుడు అంజయ్య, న్యాయవాది బాపురావు, రిటైర్డ్ తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చెదిరిన 'స్వప్న'ం

- ఐదేళ్ల తర్వాత బిడ్డకు జన్మనిచ్చి..
- కొద్దిసేపటికే రక్తస్రావంతో తల్లి మృతి
- దుఃఖసాగరంలో కుటుంబం
- వర్గల్ మండలం శేరిపల్లిలో విషాదం

వర్గల్(గజ్వేల్): అప్పటి వరకు పిల్లలు కలగడం లేదని బాధ.. ఐదేళ్ల తర్వాత గర్భవతి అయిన ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ కుటుంబంలో అంతులేని ఆనందం. కానీ ఆ సంతోషం ఎక్కువ సేపు నిలువలేదు. తీవ్ర రక్తస్రావంతో ఆ తల్లి మృతి చెందింది. ఈ విషాదకర ఘటన వర్గల్ మండలం శేరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు.. శేరిపల్లికి చెందిన బోయిని స్వప్న(25), స్వామి దంపతులకు ఐదేళ్ల కిందట వివాహమైంది. పిల్లలు లేరని దంపతులు బాధపడుతుండేవారు. చాలా కాలం తర్వాత స్వప్న గర్భం దాల్చడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. మంగళవారం ప్రసవం కోసం కుటుంబీకులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి స్వప్న మగశిశువుకు జన్మనిచ్చింది. కొద్దిసేపటికే తీవ్ర రక్తస్రావంతో స్వప్న మృతి చెందింది. వారసుడొచ్చాడని మురిసిపోతున్న ఆ కుటుంబ సభ్యుల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. ప్రసవానికి వెళ్లిన ఆమె శవంగా రావడంతో గ్రామంలోనూ విషాదచాయలు అలుముకున్నాయి. ఆరోగ్యంగా ఉన్న శిశువును గాంధీ ఆస్పత్రి ఇన్‌క్యూబేటర్‌లో పెట్టారు.



స్వప్న(ఫైల్)

పంచాయతీల్లో ట్రిపుల్‌ఆర్ సర్వే వివరాలు ప్రదర్శన



రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ వద్ద వివరాలు చూసుకుంటున్న రైతులు

నర్సాపూర్ రూరల్: ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించి త్రీడీ సర్వే వివరాలను రెవెన్యూ అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచారు. ఇందులో నర్సాపూర్ మండలంలోని నాగులపల్లి, మూసాపేట్, మహ్మదాబాద్, రెడ్డిపల్లి, పెద్ద చింతకుంట, చిన్నచింతకుంట, తిరుమలాపూర్, తుజాల్‌పూర్ గ్రామపంచాయతీలు ఉన్నాయి. భూములు కోల్పోతున్న రైతుల పేర్లతోపాటు రోడ్డుకుపోతున్న భూమి విస్తీర్ణం వివరాలను చూసుకుంటున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఓపెన్ మార్కెట్ ప్రకారం తమకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. పరిహారం ఎంత ఇస్తారో ముందే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భూమికి భూమి ఇవ్వాలని కోరారు.

హాస్టల్ మెస్ నిర్వహణపై నిర్లక్ష్యం తగదు



వంటగదిని పరిశీలిస్తున్న ఆర్డీఓ పాండు

- అందోలు–జోగిపేట ఆర్డీవో పాండు
- తీరు మారకుంటే చర్యలు తప్పవు

సంగారెడ్డి : చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వసతి గృహాల్లో మెస్ నిర్వహణ తీరుపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం అందోలు–జోగిపేట ఆర్డీవో పాండు, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి, ఆర్ఐ నాగరాజు కళాశాలలోని బాలికల వసతి గృహాన్ని, మెస్‌ను తనిఖీ చేశారు. వంటలకు వినియోగించే నూనె, కారం, వెల్లుల్లి, పసుపు ఇతర మసాలాలు నాణ్యత లేకపోవడాన్ని గమనించారు. ఎప్పటిలాగే వంట గది ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, మురుగు నీటి పారుదల సక్రమంగా లేదు. దుర్గంధం వెదజల్లుతుండటంతో ఇలా అయితే విద్యార్థులు భోజనం ఎలా చేస్తారని అధికారులు వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి రెండు పర్యాయాలు వసతి గృహాలను తనిఖీ చేసి భోజనం చేయాలని తహసీల్దార్ ఈశ్వరీరాణిని ఆర్డీవో పాండు ఆదేశించారు. అధికారుల తనిఖీ సమయంలో ప్రిన్సిపాల్ నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు అందుబాటులో లేరు. ఆర్డీవో పాండు ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి వారం రోజుల్లోగా వసతి గృహలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచని సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని, వినకపోతే విధుల నుంచి తొలగించాలన్నారు.

దేవాలయాల్లో దొంగతనాలు

- ఇద్దరు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని చిన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోమి హరీశ్, కుకునూరుపల్లికి చెందిన మహమ్మద్ రియాజ్ స్నేహితులు. కొన్ని నెలలుగా దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఏప్రిల్ మాసంలో సిద్దిపేట రూరల్ మండంలోని పొన్నాల శివారులో గల మైసమ్మ దేవాలయంలో, సెప్టెంబరులో మద్దూర్ మండలంలోని సలాక్‌పూర్ శివారులో బీరప్ప దేవాలయం హుండీలోంచి రూ.10 వేలు, 21న కొండపాక గ్రామ శివారులో గల ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలోంచి రూ.5 వేలను ఎత్తుకెళ్లారు. పలు దేవాలయాల్లో నగదుతోపాటు వెండి, బంగారు ఆభరణాలను దొంగిలించారు. ఆ డబ్బులతో జల్సాలకు అలవాటుపడ్డారు. 26న రాత్రి కుకునూరుపల్లిలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా దొంగతనం చేయడానికి బైక్‌పై వెళ్తూ పోలీసులను చూసిన పారిపోతుండగా పట్టుకున్నాం. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ.3 వేల నగదుతోపాటు బైక్, తులం బంగారం స్వాధీనం చేసుకున్నాం. నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చగా జ్యుడిషియల్ రిమాండ్ శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

సొసైటీ కార్యాలయంలో రసాభాస

- పీఏసీఎస్ చైర్మన్‌కు తీవ్రగాయాలు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. ఇది వరకు ఉన్న సీఈఓ అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. మెదక్ జిల్లా సొసైటీ అధికారిణి కరుణ ఆదేశాలతో నూతన సీఈవోకు బాధ్యతలను అప్పగించడానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫయాజోద్దీన్ సొసైటీ పాలక వర్గంతో సమావేశం ఏర్పాటు చేశారు. సొసైటీ సీఈవో బాధ్యతలను కంప్యూటర్ ఆపరేటర్ శివకృష్ణకు అప్పగిస్తూ సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో పలు అంశాలను చర్చిస్తూ తీర్మానాలను చేయాలని పలువురు డైరెక్టర్లు తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సీఈవో బాధ్యతలపై తీర్మానం చేశామని వేరే అంశాలేవి వద్దంటూ చైర్మన్ తెలపడంతో కోరం ఉన్న డైరెక్టర్‌లతో తీర్మానం చేస్తామని సత్యనారాయణ అనడంతో మాటామాటా పెరిగి దుర్భాషలాడుకుంటూ తోపులాట జరిగింది. సమావేశం నుంచి బయటకు వెళ్తున్న చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై పల్వంచ గ్రామానికి భూమయ్య భౌతికంగా దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇరువర్గాల సభ్యులు ఒకరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

లభ్యంకాని షాకీర్ ఆచూకీ

- డ్రోన్ ద్వారా గాలింపు

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి గ్రామ శివారులో గల నారింజ వాగులో బుధవారం గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం అధికార యంత్రాంగం ముమ్మరంగా గాలిస్తుంది. కర్ణాటకలోని బీదర్ పట్టణంలోని మైలార్ ప్రాంతానికి చెందిన షాకీర్ (40) బైక్‌తో సహా నారింజ వాగులో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. గురువారం రెవెన్యూ, పోలీసు యంత్రాంగం డ్రోన్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టినా ఎలాంటి ఫలితంగా దక్కలేదు. శుక్రవారం ఎన్‌డీఆర్ఎస్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపడుతామన్నారు.



డ్రోన్ కెమెరాలో పరిశీలిస్తున్న అధికారులు

రాజీయే రాజమార్గం

- 28న జాతీయ లోక్ అదాలత్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న న్యాయవాదులు
- జిల్లా వ్యాప్తంగా 22,747 కేసులు పెండింగ్



సంగారెడ్డి టౌన్ : ఒకప్పుడు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్న న్యాయ సేవలు క్రమంగా కక్షిదారులకు అందుబాటులోకి వస్తున్నాయి. సత్వరం, సమన్యాయం అందించడానికి న్యాయ సేవధికార సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయి. ఇందు కోసం 1987లో జాతీయ లోక్ అదాలత్ సేవలు ప్రారంభించారు. 'రాజీయే రాజమార్గం' అనే నినాదంతో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థలు లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులు పరిష్కరిస్తున్నాయి. కక్షిదారులను ఒప్పించి సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులను పరిష్కరించేలా కృషి చేస్తున్నారు. 28న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టుల పరిధిలో న్యాయవాదులు, పోలీసులు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకర్లకు అవగాహన కల్పించారు. ఈ సంవత్సరంలో మూడవ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు లోక్ అదాలత్ ద్వారా 19,750 కేసులు పరిష్కరించబడ్డాయి.జిల్లా వ్యాప్తంగా ఇంకా 22,747 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా 9 బెంచీలు..

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా 9 బెంచీలను ఏర్పాటు చేస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు. సంగారెడ్డిలో ఐదు బెంచీలు, జోగిపేటలో ఒకటి, నారాయణఖేడ్ ఒకటి, జహీరాబాద్ రెండు మొత్తం తొమ్మిది బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. పెండింగ్ కేసులను తొందరగా పరిష్కరించేందుకు న్యాయవాదులు, పోలీస్ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. కేసు పెండింగ్‌లో ఉన్నవారు, కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులు సూచించారు.

ఉచితంగా న్యాయ సేవలు



న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా బాధితులకు న్యాయ సేవలు అందిస్తున్నాం. క్రిమినల్ కేసులు, న్యాయపరమైన సేవలను కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. బాధితుల్లో మహిళలు, పిల్లలు, వృద్ధులు ఉంటే వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తాం.

– రమేశ్, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి

విజయవంతం చేయాలి



జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది బెంచీలు ఏర్పాటు చేశాం. న్యాయవాదులు, పోలీసులు ప్రతీ ఒక్కరూ సహకరించాలి. రాజీ మార్గం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించుకోవాలి. సత్వరమే న్యాయం జరుగుతుంది. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.

– భవానీచంద్ర, జిల్లా ప్రధాన న్యాయమూర్తి